సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శుక్రవారం । 20 । జూన్ । 2025



అంజన్న ఆలయాన్ని పట్టించుకోరా?

గండి వీరాంజనేయస్వామి దేవాలయ కుంభాభిషేకాన్ని ప్రభుత్వం జాప్యం చేస్తూ.. భక్తుల మనోభావాలను దెబ్బతీస్తోందని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. -10లో



అక్రమ కేసులో బెయిల్ మంజూరు

టీడీపీ నాయకులపై దాడి చేసినట్లుగా కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులో.. వైఎస్సార్‌సీపీ నాయకులకు బెయిల్ మంజూరు అయింది. -10లో

వాతావరణం

జిల్లాలో గురువారం 26.4 - 36.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 4.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు బద్వేలులో జాబ్‌మేళా

కడప కోటిరెడ్డి సర్కిల్: ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం 9 గంటలకు బద్వేలులోని ఎస్‌బీవీఆర్ డిగ్రీ కళాశాలలో 16 కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ చదివిన విద్యార్థులు అర్హులని ఆయన పేర్కొన్నారు. 18 నుంచి 48 ఏళ్లలోపు వయసు కలిగి ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.11,800 నుంచి రూ.40 వేల వరకు హోదాను బట్టి వేతనం ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హత పత్రాలతో పాటు ఫొటోలు తీసుకుని హాజరు కావాలని ఆయన కోరారు.

గడువు పొడిగింపు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప నగర శివారులోని డాక్టర్ వైఎస్ఆర్ క్రీడా పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 4, 5 విద్యార్థుల ప్రవేశాలకు ఈ నెల 25 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల గడువు పొడిగించినట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె.జగన్నాథరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 31 నుంచి జూన్ 19 లోపు ఆన్‌లైన్ ద్వారా దాదాపు 300 మందికి పైగా విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. 4వ తరగతిలో మొత్తం 40 సీట్లకు గాను బాలురు–20, బాలికలు–20, 5వ తరగతిలో మొత్తం 40 సీట్లకు గాను బాలురు–20, బాలికలు –20 సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు.

నియామకం



సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఇరిగేషన్ శాఖ అధికారులు

కడప కోటిరెడ్డి సర్కిల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా సుదర్శన్ రెడ్డి నియమితులయ్యారు. విజయవాడలో బుధవారం జరిగిన ఆ సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో ఆయనను ఎనుకున్నారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక ఆర్అండ్‌బీ ఇరిగేషన్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈయన కడప ఐసీడీఎస్ రూరల్ ప్రాజెక్టులో సూపరింటెండెంట్‌గా చేస్తున్నారు. ఈ సందర్భంగా జేసుదాస్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా సెక్రటరీ కృష్ణ ప్రసాద్, నగర అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

22న అండర్ 14,16 క్రికెట్ ఎంపికలు

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 22వ తేదీన అండర్ 14, 16 పురుషుల క్రికెట్ జట్టు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్సార్ డిస్ట్రిక్ట్ కార్యదర్శి ఎ.రెడ్డిప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక వైఎస్సార్ ఏసీఏ స్టేడియంలో ఆదివారం ఉదయం 7:30 గంటలకు నిర్వహించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. క్రీడాకారులు ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్(ఫారం 5) ఒరిజినల్‌తోపాటు ఒక సెట్ జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతోపాటు తమ కిట్ బ్యాగులు తీసుకురావాలన్నారు. అండర్ 16 జట్టుకు 2009 సెప్టెంబర్ 1 తర్వాత 2011 ఆగస్టు 31 ముందు జన్మించిన వారు అర్హులని తెలిపారు. అండర్ 14 జట్టుకు 2011 సెప్టెంబర్ 1 తర్వాత 2013 ఆగస్టు 31 ముందు జన్మించిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు సెలక్షన్స్‌కు హాజరు కావాలని వివరించారు.

వైవీయూ దూరవిద్య ఫలితాలు విడుదల



ఫలితాలు విడుదల చేస్తున్న డైరెక్టర్ కె.కృష్ణారెడ్డి

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ (సీడీవోఈ) పోస్టు గ్రాడ్యుయేషన్ కోర్సుల ఫస్ట్ సెమిస్టర్ పరీక్షా ఫలితాలను డైరెక్టర్ కె.కృష్ణారెడ్డి ఉప సంచాలకులు డాక్టర్ ఎం.శ్రీధర్‌బాబుతో కలిసి విడుదల చేశారు. గురువారం విశ్వవిద్యాలయంలోని తన చాంబర్‌లో ఫలితాలు విడుదల సందర్భంగా డైరెక్టర్ ఆచార్య కె.కృష్ణారెడ్డి మాట్లాడారు. మొత్తం 8 విభాగాలలో ఎకనామిక్స్ (88.8 శాతం), ఇంగ్లిష్ (96.6 శాతం), హిస్టరీ (66.6 శాతం), మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం (100 శాతం) పొలిటికల్ సైన్స్ (100 శాతం), సైకాలజీ (100 శాతం), స్పెషల్ తెలుగు (86.3 శాతం) కామర్స్ (90.9 శాతం) ఫలితాలు వచ్చాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దూర విద్యా కేంద్రం సిబ్బంది టి.చంద్రశేఖర్‌రెడ్డి, కె.రాజశేఖర్, ఎస్.జబీబుల్లా, కె.కనకరత్నమ్మ పాల్గొన్నారు.

కరోనా.. మళ్లీ హైరానా

- లక్షణాలు ఫుల్.. నిర్ధారణ పరీక్షలు నిల్
- పొరుగు జిల్లాల్లో నమోదవుతున్న కేసులు
- జిల్లాలోనూ అధికారికంగా ఒక కేసు నమోదు
- ముందస్తు చర్యలను గాలికొదిలేసిన ప్రభుత్వం
- చికిత్స ఏర్పాట్లపై పాలకులు నిర్లక్ష్య ధోరణి



కడప రూరల్: కరోనా మళ్లీ కోరలు చాచింది. రాష్ట్ర వ్యాప్తంగా కేసులు నమోదవుతున్నాయి. పొరుగున ఉన్న జిల్లాల్లో కూడా వెలుగుచూస్తున్నాయి. జిల్లాలోనూ అధికారికంగా మంగళవారం ఒక కేసు నమోదు అయింది. అయితే ప్రభుత్వం నుంచి ముందస్తు జాగ్రత్తలు ఏ మాత్రం లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

శరవేగంగా సంక్రమించే అంటు వ్యాధి

జలుబు, దగ్గు, జ్వరం, గొంతు నొప్పి, ఒళ్లు నొప్పులు తదితర లక్షణాలు ఉంటే కరోనాగా అనుమానిస్తారు. నిర్ధారణ పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారిస్తారు. ఇది అంటు వ్యాధి. శరవేగంగా ఒకరి నుంచి మరొకరికి సంక్రమిస్తుంది. అందువల్ల భౌతిక దూరం పాటించడంతోపాటు ముఖానికి మాస్క్ ధరించాలి. చేతులను తరచూ శుభ్రం చేసుకోవాలి. వ్యక్తిగత శుభ్రతను పాటించాలని వైద్యుల సూచిస్తారు. ఇది ఒకరికి వస్తే పక్కన ఉన్న దాదాపుగా అందరికీ వస్తుంది.

ఖర్చెందుకు దండగని..?

కూటమి ప్రభుత్వం వచ్చాక వైద్య రంగం కుదేలైంది. వైద్య రంగానికి ఖర్చు చేయడం దండగని పాలకులు భావించారనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ తరుణంలో కరోనా మహమ్మారి మళ్లీ తన ఉనికిని చాటుకుంది. కాగా జిల్లాలో ఎక్కడా ముందస్తు జాగ్రత్తలు మచ్చుకైనా కనిపించవు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు ఇలా ఏ ప్రభుత్వ ఆసుపత్రిలో కూడా నిర్ధారణ పరీక్షలు నిర్వహించే కిట్స్ లేవు. ఆ దిశగా ప్రభుత్వమూ చర్యలు తీసుకోలేదు. దీంతో లక్షణాలు ఉన్న వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయడం గగనంగా మారింది. ఏదో చెయ్యాలి కదా అన్న చందంగా కడప రిమ్స్‌లో 10 పడకలతో ఐసోలేషన్‌ను ఏర్పాటు చేశారు.

కరోనా ప్రాంతాల నుంచి రాకపోకలు

తాజాగా 4వ విడత కరోనా కేసులు సింగపూర్, మలేషియా తదితర దేశాల్లో వెలుగు చూశాయి. దేశంలో కేరళ, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో నమోదైనాయి. రాష్ట్రంలో విశాఖపట్నం, కర్నూలు, అన్నమయ్య ఇలా పలు జిల్లాల్లో కేసులు వచ్చాయి. ఈ ప్రాంతాల నుంచి ప్రజలు జిల్లాకు రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే ఇక్కడి నుంచి ప్రజలు పలు ప్రాంతాలకు వెళ్లి వస్తుంటారు. ఇలా వచ్చీ పోయే వారిలో ఎవరెవరికి కరోనా ఉందో.. లేదో తెలియని పరిస్థితి. ఆఖరికి లక్షణాలు కలిగిన వారికి వ్యాధిని నిర్ధారించే పరిస్థితి లేకపోవడం దారుణం.

దాచిపెడుతున్నారు?

తాజాగా ఒక ప్రభుత్వ శాఖలో కరోనా లక్షణాలతో ఉన్న ఒక ఉద్యోగిని గుర్తించారు. ఆ కేసును నిర్ధారించడానికి రిమ్స్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దోబూచులాడారు. దీంతో ఎక్కడా కరోనా అనేదే లేదు అని చెప్పడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కరోనా వచ్చిందంటే నివారణ కోసం యంత్రాంగాన్ని సమాయత్తం చేయాలి. అందుకోసం బడ్జెట్‌ను కేటాయించాలి. డబ్బును ఖర్చు చేయడం ఇష్టం లేక కరోనా కేసులను దాచి పెడుతున్నారనే ఆరోపణలు పెద్దగానే వినిపిస్తున్నాయి. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో లక్షణాలు కలిగిన వారికి నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కేసులు వెలుగు చూస్తాయనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. పాలకులు లాభార్జనలను చూసుకోకుండా ప్రజల మెరుగైన ఆరోగ్య పరిరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్ఆర్‌సీపీ పాలనలో యుద్ధ ప్రాతిపదికన చర్యలు

జిల్లాలో 2020 మార్చి 31వ తేదీన మొదటి సారిగా కేసులు నమోదైనాయి. వరుసగా మూడేళ్ల పాటు కరోనా వచ్చింది. దాదాపుగా లక్షల్లో కేసులు వెలుగు చూశాయి. అందులో 1,34,763 మంది ఉచితంగా వైద్య చికిత్సలు పొందారు. అప్పుడు కరోనా కట్టడికి నీళ్ల ప్రాయంగా ఖర్చు చేశారు. లక్షణాలు కలిగిన వారికి అన్ని ప్రభుత్వ ఆసుపత్రులతోపాటు మొబైల్ వాహనాల ద్వారా ఆర్టీపీసీఆర్, ర్యాపిడ్ కిట్స్ ద్వారా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వ్యాధి నిర్ధారణ అయిన వారిని ఐసోలేషన్ కేంద్రాలు, ఆసుపత్రులకు తరలించి ఉచితంగా వైద్య సేవలు అందించడంతోపాటు పౌష్టికాహారం అందించారు. లక్షణాలు కలిగిన వారిని గుర్తించడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషించారు. ప్రజలకు మాస్కులు, శానిటైజర్స్‌ను అందజేశారు. ప్రస్తుత టీడీపీ కూటమి పాలనలో ఆ పరిస్థితులు మచ్చుకైనా కనిపించడం లేదు.

మహానాడు వేళలో..

కడపలో మే 27, 28, 29వ తేదీల్లో తెలుగు దేశం పార్టీ మహానాడు నిర్వహించింది. ఈ మహానాడు నిర్వహణకు ముందు చాగలమర్రికి చెందిన ఒక మహిళకు కరోనాగా నిర్ధారించి కడప రిమ్స్‌లోని ఐసోలేషన్‌లో చేర్పించారు. అక్కడి అధికారులు కరోనాగా నిర్ధారించి, ప్రకటించారు. అయితే జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు.. 'కరోనాను నిర్ధారించడానికి కిట్స్ లేవు. కరోనాగా ఎలా పరిగణించాలి' అని అన్నారు. ఇద్దరు వైద్యాధికారుల భిన్నమైన అభిప్రాయాలు వ్యక్తం చేయడం.. అందరిలో సందేహాలు రేకెత్తించాయి.

నిర్ధారణ పరీక్షలకు కిట్స్ వచ్చాయి



కరోనా నిర్ధారణ పరీక్షల కోసం ఇప్పుడే 100 ఆర్టీపీసీఆర్, 500 ర్యాపిడ్ కిట్స్ వచ్చాయి. అవసరమైన వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ర్యాపిడ్ కిట్స్ ద్వారా, కడప రిమ్స్‌లో ఆర్టీపీసీఆర్ ద్వారా నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తారు. కరోనా నిర్ధారణ అయితే కడప రిమ్స్‌లో ఏర్పాటు చేసిన ఐసోలేషన్‌లో చేర్పించి ఉచితంగా వైద్య సేవలు అందిస్తాం.

– డాక్టర్ నాగరాజు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి

కడపలో కోవిడ్

కడప రూరల్: జిల్లా కేంద్రమైన కడప నగరంలో ఒక కరోనా(కోవిడ్) కేసు నమోదైంది. ఈ కేసు ఆలస్యంగా వెలుగు చూసింది. కడప నగరం ఎన్జీఓ కాలనీకి చెందిన 48 ఏళ్ల ప్రభుత్వ ఉద్యోగి (సీనియర్ అసిస్టెంట్) దీర్ఘకాలిక వ్యాధులు, కరోనా లక్షణాలతో బాధపడుతున్నాడు. అతను కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. 13వ తేదీన కోవిడ్ పరీక్షలను నిర్వహించగా పాజిటివ్‌గా తేలింది. రిమ్స్ వైద్యులు ఆ వ్యక్తిని ఐసోలేషన్‌లో ఉంచి చికిత్స అందించారు. ఈ విషయాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు నిర్ధారించారు.

దోబూచులాట

కరోనా కేసుపై స్పష్టత ఇవ్వడానికి అటు రిమ్స్, ఇటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు దోబూచులాడారు. కరోనా కేసు నమోదైన వ్యటికీ చెప్పడానికి జంకుతున్నారు. అతనికి కోవిడ్ లక్షణాలు ఉన్నాయి. కరోనా కాదని ఒకరు, చికిత్స చేసిన వైద్యులను అడగాలని మరొకరు.. ఇలా ఒకరిపై ఒకరు చెప్పుకోవడం గమనార్హం. కేసు నమోదైనప్పుడు సమాచారం తెలిపితే ఇతరులు అప్రమత్తమవుతారని, జాగ్రత్తలు తీసుకుంటారనే జ్ఞానం కూడా లేకపోవడం దారుణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

మాపై కరుణ చూపవా..

'జలుబుంది.. దగ్గుంది.. జ్వరముంది.. ఒళ్లు నొప్పులూ ఉన్నాయి. ఇది ఏ జబ్బో తెలియదు. చూసేదానికి కరోనా లక్షణం మాదిరే ఉంది. నిర్ధారణ చేసుకుందామనుకుంటే ఏ ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు లేవు. ఇది ఒకరికి వస్తే అందరికీ వస్తుంది. అదే మా భయం. బయట పనులపై తిరుగుతుంటాం. మా పక్క నుంచే జనాలు వెళ్తూ.. వస్తూ ఉంటారు. ఎవరిలో ఈ మహమ్మారి దాగుందో తెలియదు. ఎందుకో మరి.. ఈ ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఖర్చు దండగనుకుందేమో..? కరోనా గారు.. పాలకుల అసమర్థతను చూసుకొని రెచ్చిపోవాకు.. పొరపాటున కూడా మా జోలికి రాకు. మేము తట్టుకోలేం. మా పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. మాపై కరుణ చూపు' అని జిల్లా ప్రజలు వేడుకుంటున్నారు.

సోలార్ విద్యుత్‌తో డబ్బు ఆదా

కడప కార్పొరేషన్: రాయితీతో ఇంటిపై సోలార్ రూఫ్ టాప్ అమర్చుకోవడం వల్ల విద్యుత్ బిల్లు ఆదా అవుతుందని విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ తెలిపారు. స్థానిక కడప డివిజన్ కార్యాలయ ఆవరణలో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఉచితంగా లభించే సూర్య కాంతితో విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం వల్ల బొగ్గు, నీరు వంటి సహజ వనరులు వృధా కాకుండా ఉంటాయన్నారు. పర్యావరణ పరిరక్షణకు ఇది ఎంతగానో దోహద పడుతుందని తెలిపారు. సౌర శక్తి నిరంతరం ఉత్పత్తి అవుతుంది కాబట్టి దీని నిర్వహణ ఖర్చు చాలా తక్కువని, ప్రారంభ పెట్టుబడి ఉన్నప్పటికీ కొద్ది కాలంలోనే అది తిరిగి వస్తుందన్నారు. పెట్టుబడిని నాలుగేళ్లతో తిరిగి పొందవచ్చన్నారు. మనం ఉపయోగించగా మిగిలిన విద్యుత్‌ను ఎలక్ట్రిసిటీ గ్రిడ్‌కు సరఫరా చేయవచ్చన్నారు. దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కేంద్ర ప్రభుత్వం ఈ పథకానికి సబ్సిడీలు ఇస్తోందని, 3 కిలోవాట్ సామర్థ్యంతో సోలార్ ప్యానెల్స్ నిర్మించుకుంటే గరిష్టంగా



సదస్సులో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఎస్.రమణ

రూ.78 వేల సబ్సిడీ వస్తుందన్నారు. కడప డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరిసేవ్యా నాయక్ మాట్లాడుతూ హౌసింగ్ లోన్‌తోపాటు పీఎం సూర్యఘర్ పథకానికి కూడా బ్యాంకులు లోన్ ఇస్తాయన్నారు. సొంత ఖర్చులతో సోలార్ అమర్చుకున్నా సబ్సిడీ వస్తుందన్నారు. కరెంటు బిల్లు కట్టే బదులు లోన్ ఈఎంఐ కడుతూ ఉంటే సరిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్, ఏపీజీబీ బ్యాంకుల ప్రతినిధులు, విద్యుత్ శాఖ అధికారులు, వినియోగదారులు పాల్గొన్నారు.

లాసెట్‌లో మెరిసిన మనోళ్లు

- వేర్వేరు విభాగాల్లో 1,2,4 ర్యాంకులు మనవే
- వైఎస్సార్, అన్నమయ్య జిల్లా విద్యార్థుల ప్రతిభ



లోకేశ్వరి

కడప ఎడ్యుకేషన్/ఒంటిమిట్ట/పీలేరు రూరల్/రాయచోటి జగదాంబ సెంటర్: ఏపీ లాసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాల్లో మనోళ్లు మెరిశారు. వేర్వేరు విభాగాల్లో 1,2,4 ర్యాంకులు సాధించి భళా అనిపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 5న నిర్వహించిన ఏపీ లాసెట్, ఏపీ పీజీ సెట్–2025 ప్రవేశ పరీక్షల ఫలితాలు గురువారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో వైఎస్సార్ కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు.

- పీలేరు విద్యార్థిని పల్లపు గిరీష్మ ఎల్ఎల్‌బీ ఐదేళ్ల కోర్సులో ప్రథమ ర్యాంక్ సాధించింది. పీలేరులో న్యాయవాదిగా పని చేస్తున్న మండలంలోని ముడుపులవేముల పంచాయతీ రాయలవారిపల్లెకు చెందిన జయశంకర్ కుమార్తె గిరీష్మ.. స్థానిక శ్రీ చైతన్య జూనియర్ కళాశాల సీఈసీ గ్రూపులో ఇంటర్మీడియెట్ పూర్తి చేసింది. ఆమె లాసెట్‌లో 107 మార్కులు సాధించి ప్రథమ ర్యాంకు కైవసం చేసుకుంది.
- ఒంటిమిట్టకు చెందిన వై.లోకేశ్వరి ఎల్ఎల్ఎమ్ ప్రవేశ పరీక్షలో 120 మార్కులకు 108 సాధించి రెండో ర్యాంకు కైవసం చేసుకుంది. ఈ విద్యార్థిని 2019లో పదో తరగతిలో గ్రేడ్ ఎ–వన్ సాధించినందుకు అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. హైదరాబాద్‌లోని మియాపూర్‌లో శ్రీ చైతన్య ఐఏఎస్ అకాడమీలో ఇంటర్మీడియెట్‌లో చేరి హెచ్ఈసీ గ్రూపు తీసుకొని స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించారు. ఇటీవల వైజాగ్‌లోని సెంట్రల్ నల్సార్ దామోదరయ్య, సంజీవయ్య యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ లా సీటు సాధించారు. ప్రస్తుతం యూపీఎస్సీ ఢిల్లీ అకాడమీ ఆన్‌లైన్ క్లాసుల ద్వారా సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నట్లు తల్లిదండ్రులు వెల్లడించారు.
- రాయచోటి పట్టణానికి చెందిన వి.రమేష్ ఎల్ఎల్‌బీ మూడేళ్ల కోర్సులో 113 మార్కులతో స్టేట్ 4వ ర్యాంకు సాధించారు.

లాసెట్‌లో..

మూడు సంవత్సరాల బీఏ/ ఎల్ఎల్‌బీ కోర్సుల ప్రవేశానికి సంబంధించి వైఎస్సార్ కడప జిల్లాలో 846 మంది రిజిస్టర్ చేసుకున్నారు. ఇందులో 651 మంది పరీక్ష రాయగా, 635 మంది అర్హత సాధించి 97.54 శాతం ఉత్తీర్ణత సాధించారు. 5 ఏళ్ల లాసెట్‌కు సంబంధించి 157 మంది రిజిస్టర్ చేసుకోగా.. 128 మంది పరీక్ష రాయగా 117 మంది క్వాలిఫైడ్ అయి 91.41 శాతం ఉత్తీర్ణత సాధించారు.

పీజీఎల్ సెట్‌లో..

రెండు సంవత్సరాల ఎల్ఎల్ఎం/ ఎంఎల్ కోర్సులకు సంబంధించి వైఎస్సార్ కడప జిల్లాలో 97 మంది అభ్యర్థులు రిజిస్టర్ చేసుకున్నారు. ఇందులో 87 మంది ప్రవేశ పరీక్ష రాయగా 87 మంది క్వాలిఫై అయ్యి 100 శాతం ఉత్తీర్ణత సాధించారు.

ఈ సారైనా సవ్యంగా సాగేనా..?

- కౌన్సిల్ మీట్‌పై సర్వత్రా ఉత్కంఠ
- మేయర్‌తో సమానంగా ఎమ్మెల్యేకు కుర్చీ వేశారా!
- వేసి ఉంటే ఎవరి ఆదేశాలతో.. ఎవరి మెప్పు కోసం..
- కౌన్సిల్ హాలు తాళం చెవి ఎవరి వద్ద ఉంది?
- అధికార, ప్రతిపక్ష పార్టీలు ఎత్తుకు పైఎత్తులు
- నేడు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం



కడప మున్సిపల్ కార్యాలయం



కౌన్సిల్ హాలు

కడప కార్పొరేషన్: దాదాపు ఆరు మాసాల తర్వాత ఈ నెల 20వ తేదీన (శుక్రవారం) జరుగుతున్న నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. కౌన్సిల్ హాలులో మేయర్‌తో సమానంగా తనకు వేదికపై కుర్చీ వేయలేదన్న కారణంతో.. గత రెండు సర్వసభ్య సమావేశాల్లో స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆర్.మాధవిరెడ్డి తన అనుచరులతో ప్రవేశించి నానా రచ్చ చేసిన సంగతి తెలిసిందే. తనకు లేని కుర్చీ.. మేయర్‌కు కూడా ఉండకూడదని భీష్మించుకుని.. మేయర్ సురేష్ బాబుపై అనర్హత వేటు వేయించాలని ఆమె చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. పురపాలక శాఖ కార్యదర్శి ఏకపక్షంగా జారీ చేసిన ఉత్తర్వులపై రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం స్టేటస్ కో విధించింది. మళ్లీ విచారణ చేసి మేయర్ వాదన వినాలని కోర్టు ఇచ్చిన ఆదేశాలను పురపాలక అధికారులు పెడచెవిన పెట్టి పాత పద్ధతిలోనే విచారణ చేసి.. ఈనెల 20వ తేదీన సర్వసభ్య సమావేశం కంటే ముందే మళ్లీ అనర్హత వేటు వేయాలని పన్నిన కుయుక్తులు న్యాయస్థానం ముందు ఫలించలేదు. 19వ తేదీ వరకూ మేయర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని యథాతథ స్థితి కొనసాగించాలని కోర్టు తీర్పు నిచ్చిన నేపథ్యంలో.. ఈనెల 20వ తేదీన మేయర్ సురేష్‌బాబు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరగడం తథ్యమని తేలిపోయింది.

మేయర్ కోరినా కౌన్సిల్ హాలు తలుపులు ఎందుకు తెరవలేదో..

మేయర్ ఆదేశాల మేరకు నడుచుకోవాల్సిన కమిషనర్.. అందుకు విరుద్ధంగా వ్యవహరించి ఎక్స్ అఫిషియో సభ్యులైన కడప, కమలాపురం ఎమ్మెల్యేలకు మేయర్‌తో సమానంగా వేదికపై కుర్చీలు వేసినట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది. అందుకే కౌన్సిల్ హాలు తాళం చెవులను తన వద్ద ఉంచుకొని.. మేయర్ స్వయంగా కోరినా తలుపులు తెరవలేదని సమాచారం. దీంతో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు కౌన్సిల్ హాలు తెరిచేలా ఆదేశాలివ్వాలని జాయింట్ కలెక్టర్‌ను కోరడంతోపాటు సమావేశంలోకి ఇతరులను ఎవ్వరినీ అనుమతించవద్దని, పటిష్ట భద్రత కల్పించాలని జిల్లా ఎస్పీని కోరారు. అంతేగాక 39 మంది వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు హైకోర్టును ఆశ్రయించి తమకు భద్రత కల్పించాలని విన్నవించారు. కార్పొరేటర్ల పిటీషన్‌ను విచారణకు స్వీకరించిన న్యాయస్థానం నగరపాలక సర్వసభ్య సమావేశానికి పటిష్ట భద్రత కల్పించాలని, గతంలో జరిగిన పొరపాట్లు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలను ఆదేశించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం జరిగే సర్వసభ్య సమావేశపు హాలులో ఎమ్మెల్యేలకు వేదికపై కుర్చీలు వేసి ఉంటే.. మేయర్, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఎలా స్పందిస్తారు.. కమిషనర్ ఎవరి ఆదేశాలతో.. ఎవరి మెప్పు కోసం ఈ పని చేశారు.. కమిషనర్‌పై ఎలాంటి చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్లు పట్టుబడతారు.. అనే ప్రశ్నలకు నేడు సమాధానం లభించబోతోంది. ఒక వేళ కుర్చీ వేయకపోతే ప్రభుత్వ విప్ ఆర్.మాధవిరెడ్డి వ్యవహార శైలి ఎలా ఉంటుందనేది కూడా సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

ఏం చేయాలన్నా న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సిందే

వైఎస్సార్‌సీపీ మేయర్, కార్పొరేటర్ల గోడు విని న్యాయస్థానం ఆదేశాలిచ్చినా.. వాటిని అమలు చేయాల్సింది మళ్లీ అధికారులే కావడంతో సమస్య మళ్లీ మొదటికొస్తోంది. సభ నిర్వహణకు, సభలో చేసిన తీర్మానాలను మినిట్స్ బుక్‌లో రాయించేందుకు, వాటిని అమలు చేసేందుకు, అభివృద్ధి పనులు చేసేందుకు ఇలా ప్రతి దానికి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, మేయర్ న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉత్పన్నమవుతోంది. గతంలో ఎన్నడూ ప్రతిపక్షంపై అధికార పక్షం ఇంతటి ఘర్షణ పూరిత వాతావరణం తీసుకురాలేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

నగరాభివృద్ధిపై కలిసి వస్తేనే..

కడప నగరాభివృద్ధిపై నగరపాలక సంస్థలో పాలకపక్షంగా ఉన్న వైఎస్సార్‌సీపీతో అధికార పార్టీ టీడీపీ కలిసివస్తేనే.. నగర ప్రజలకు మేలు జరుగుతుందని పలువురు భావిస్తున్నారు. అలా కాకుండా మేం అధికారంలో ఉన్నాం.. ఏం చేసినా చెల్లుతుందని అహం ప్రదర్శిస్తే ఈ సమావేశం కూడా సవ్యంగా సాగే పరిస్థితి ఉండదని తెలుస్తోంది.

పెండింగ్‌లో ప్రజా సమస్యలు



అధికార పార్టీలో ఉంటూ ప్రజా సమస్యలపై బాధ్యతాయుతంగా స్పందించి నగర పాలక వర్గానికి సలహాలు, సూచనలు ఇచ్చి నగరాభివృద్ధికి సహకరించాల్సిన ఎమ్మెల్యే.. కుర్చీనే ప్రధాన ఎజెండాగా మార్చి ఏడాది కాలం వృథా చేశారనే విమర్శలు ఉన్నాయి. దీంతో ప్రజా సమస్యలు, అభివృద్ధి పనులన్నీ పెండింగ్‌లో ఉండిపోయాయి. ముఖ్యంగా ప్రజలపై పన్నుల భారం అధికంగా ఉంది. దీనిపై అధికారులను ప్రశ్నించే అవకాశం కార్పొరేటర్లకు లభించడం లేదు. దీంతో ప్రజల గోడు వినే నాథుడు గానీ, వారి సమస్యలను సభలో ప్రస్తావించి పరిష్కరించే వారు గానీ కరువయ్యారు. పాలకపక్షంగా ఉన్న మేయర్, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు చేసిన తీర్మానాలకు గానీ, వారి మాటకు గానీ కమిషనర్ విలువ ఇవ్వడం లేదని తెలుస్తోంది. ప్రొటోకాల్‌ను పక్కన బెట్టి అధికార పక్ష ఎమ్మెల్యే మాధవిరెడ్డి ఆదేశాలనే ఆయన శిరసావహించి పని చేస్తున్నట్లు ఇటీవల జరిగిన సంఘటనలు రుజువు చేస్తున్నాయి. జిల్లా అధికార యంత్రాంగమంతా ఎమ్మెల్యేకు సానుకూలంగా ఉండటంతో మేయర్, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్ల బాధ అరణ్యరోదనగా మారింది.

క్లుప్తంగా

చెట్టును ఢీకొన్న కారు



చెట్టును ఢీకొని దెబ్బతిన్న కారు

ముద్దనూరు : మండలంలోని కొత్తపల్లె గ్రామ సమీపంలో గురువారం సాయంత్రం వేగం అదుపుతప్పి ఓ కారు చెట్టును ఢీకొంది. మరో కారు స్వల్పంగా దెబ్బతింది. బాధితుల సమాచారం మేరకు.. కడప నుంచి ముద్దనూరుకు రెండు కార్లు ముందు వెనుక ప్రయాణిస్తున్నాయి. కొత్తపల్లె సమీపంలోకి రాగానే వేగం అదుపు తప్పడంతో ఒక కారు రహదారి పక్కనే వున్న చెట్టును ఢీకొంది. కారు ముందు భాగం పాక్షికంగా దెబ్బతింది. అదృష్టవశాత్తు కారులో ప్రయాణిస్తున్న వారికి ఎవరికీ గాయాలు కాలేదు. ఆ కారు వెనుక వస్తున్న మరో కారు స్వల్పంగా దెబ్బతింది.

వృద్ధురాలు మృతి

కలికిరి (వాల్మీకిపురం) : రైలు కింద పడి ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన గురువారం మండల పరిధిలో చోటు చేసుకుంది. వాల్మీకిపురం మండలం చింతలవారిపల్లికి చెందిన కె.బొజ్జమ్మ(80)కు వయస్సు పైబడి మతి స్థిమితం లేకుండా తిరుగుతుంటోంది. ఆమెకు భర్త, కుమార్తె మరణించారు. అల్లుడు వద్ద ఉంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో గురువారం అల్లుడు తన బంధువుల అంత్యక్రియలకు వెళ్లాడు. దీంతో ఆమె సమీపంలోని రైల్వే ట్రాక్‌మీదకు వెళ్లింది. అదే సమయంలో తిరుపతి నుంచి గుంతకల్ వెళ్లే ప్యాసింజరు రైలు ఢీకొనడంతో ఆమె రెండు కాళ్లు విరిగిపోయాయి. ఆమెను ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మరణించినట్లు వైద్యులు ధృవీకరించారు.

ప్రసిద్ధిగాంచిన అంజన్న ఆలయాన్ని పట్టించుకోరా..?

గండి మహాకుంభాభిషేకం జాప్యంపై మండిపడిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



గండి నూతన ఆలయాన్ని పరిశీలిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

చక్రాయపేట : రాయలసీమ జిల్లాలలోనే ప్రసిద్ధిగాంచిన గండి వీరాంజనేయ స్వామి ఆలయాన్ని కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డి మండి పడ్డారు. గండి ఆలయ కుంభాభిషేకం నిర్వహించక జాప్యం చేస్తూ భక్తుల మనోభావాలను దెబ్బ తీస్తోందని ఆయన ధ్వజమెత్తారు. గురువారం ఆయన గండి వీరాంజనేయ స్వామి ఆలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ఉప ప్రధాన అర్చకుడు రాజా రమేష్, వేద పారాయణదారు రామమోహన్ శర్మ, అర్చకులు రఘు, సాయిలు ఆయనకు పూర్ణ కుంభంతో స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోపాటు తమ కుటుంబ సభ్యుల పేరిట ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆయన గండిలో వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం హయాంలో మంజూరైన రు.28 కోట్లతో నూతనంగా నిర్మించిన ఆలయాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్వయంగా శ్రీరామ చంద్రుడు తన బాణంతో చెక్కిన ప్రతిమ ఇక్కడ ఉన్న వీరాంజనేయుడని, అందుకే ఈక్షేత్రం ఎంతో ప్రసిద్ధి గాంచిందని చెప్పారు. అందుకే తమ ప్రభుత్వ హయాంలో ఈ ఆలయానికి రూ. 28 కోట్ల నిధులు మంజూరు చేశామన్నారు. ఏడాది క్రితం నాటికే ఆలయం పనులు 95 శాతం పూర్తయ్యాయని చెప్పారు. కేవలం 5 శాతం మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. ఈ పనులు చేయడానికి కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. అధికారంలోకి వచ్చి యేడాది కాలం దాటినా మహాకుంభాభి షేకం నిర్వహించి భక్తులకు మూల విరాట్ దర్శనం కల్పించడంలో ఈ ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇప్పటికే 4 సంవత్సరాల నుంచి మూల విరాట్ దర్శనం లేక భక్తుల మనోభావాలు దెబ్బ తింటుంటే ప్రభుత్వం జాప్యం చేయడం మంచి పద్ధతి కాదని ఆయన చెప్పారు. మరో నెల రోజుల తర్వాత శ్రావణమాసం మొదలవనుందన్నారు. సుమారు 10 లక్షల మందికి పైగా స్వామిని దర్శించుకొనే అవకాశం ఉందన్నారు. శ్రావణ మాసం లోపు ఆలయ కుంభాభిషేకం నిర్వహించి భక్తులకు మూల విరాట్ దర్శనం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈవిషయంపై తాము పలు మార్లు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసు కెళ్లామన్నారు. ఆయన గండికి వచ్చి ఆలయాన్ని పరిశీలించి త్వరలోనే సమీక్ష నిర్వహిస్తామని చెప్పారన్నారు. మరి కలెక్టర్ సమీక్ష నిర్వహించారో లేదో కూడా తెలియని పరిస్థితి ఉందన్నారు. ఆలయానికి శ్రావణ మాసం లోపు మహా కుంభాభిషేకం నిర్వహించి భక్తులకు స్వామి దర్శనం చేయించి వారి మనోభావాలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సతీష్‌రెడ్డి తనయుడు రోహన్ నాగిరెడ్డి, చక్రాయపేట, వేంపల్లె మండల కన్వీనర్లు ప్రవీణ్ కుమార్ రెడ్డి, చంద్ర ఓబుళ రెడ్డి, జడ్పీటీసీలు శివ ప్రసాద రెడ్డి, రవి కుమార్ రెడ్డి, ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యదర్శి రామాంజుల రెడ్డి, పంచాయతీ రాజ్ కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, రైతు విభాగం కార్యవర్గ సభ్యుడు ఎల్ఎన్ కృష్ణా రెడ్డి, మండల యూత్ కన్వీనర్ రామాంజనేయ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు గఫూర్, సభాపతి నాయుడు, ఆలయ చైర్మన్ కావలి కృష్ణతేజ, పాలక మండలి సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డి సర్కిల్: 2025 సంవత్సరానికి గానూ ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిలా స్త్రీశిశు సంక్షేమ శాఖ సాధికారిక అధికారిణి శ్రీలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ స్థాయిలో క్రీడలు, సంఘ సేవా, సైన్స్, టెక్, పర్యావరణం, ఆర్ట్స్, లలిత కళలు, వినూత్నమైన సేవలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 18 ఏళ్లలోపు బాలికలు అర్హులని పేర్కొన్నారు. జూలై 31వ తేదీలోపు అప్లికేషన్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు హెచ్‌టీటీపీఎల్//అవార్డ్స్.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలని ఆమె వివరించారు.

యువకుడికి తీవ్ర గాయాలు

మదనపల్లె రూరల్ : కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం కురబలకోట మండలంలో జరిగింది. బోయపల్లెకు చెందిన నవీన్(27) మిట్స్ కాలేజీలో సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం విధులు ముగించుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతుండగా, కాలేజీ సమీపంలోని మెయిన్‌రోడ్డుపై అకస్మాత్తుగా కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డాడు. నవీన్ తీవ్రంగా గాయపడగా, గమనించిన స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

పంచాయితీరాజ్ ఎస్ఈకి చీఫ్ ఇంజనీర్‌గా పదోన్నతి



పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్‌గా పదోన్నతి పొందిన గోపవరం శ్రీనివాసులరెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : పంచాయితీరాజ్ జిల్లా పర్యవేక్షక ఇంజనీర్‌గా పని చేస్తున్న గోపవరం వెంకట శ్రీనివాసుల రెడ్డికి చీఫ్ ఇంజనీర్‌గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెలాఖరుకంతా ఆయన జిల్లా నుంచి రిలీవై రాష్ట్ర పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ జాయింట్ సెక్రటరీగా బాధ్యతలను చేపట్టనున్నారు. కోవెలకుంట్ల మండలం గుండ్లదుర్తి గ్రామానికి చెందిన శ్రీనివాసుల రెడ్డి గతంలో రాజంపేటలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తూ పదోన్నతి ద్వారా 2021 సెప్టెంబర్ 2వ తేదీన ఎస్ఈగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు పంచాయితీ రాజ్ ఇంజనీరింగ్ విభాగంలో పర్యవేక్షక ఇంజనీర్‌గా ఎక్కువకాలం పనిచేసిన అధికారిగా గుర్తింపు పొందారు. జిల్లాలో ఆయన హయాంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి అందరి ప్రశంసలు అందుకున్నారు. ఆయనకు పదోన్నతి లభించడంపట్ల పంచాయతీరాజ్ వర్గాలేకాకుండా ఇతర అధికారులు సైతం అభినందలు తెలియజేశారు.

ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్

- ఈనెల 30వ తేదీ వరకు అవకాశం
- జేసీ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ప్రత్యేక సబ్ డివిజన్ డ్రైవ్ చేపట్టామని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ తెలిపారు. రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో జాయింట్ పట్టాదారులుగా నమోదైన రైతులు ప్రభుత్వ సంక్షేమ పథకాలైన అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం వంటివి పొందడంలో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందన్నారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ఆ సమస్యలను పరిష్కరించేందుకు సబ్ డివిజన్ డ్రైవ్ చేపట్టామన్నారు. రెవెన్యూశాఖ సబ్ డివిజన్ సేవ కోసం రూ. 500 రుసుము నిర్ణయించిందన్నారు. అయితే కేవలం నామమాత్రంగా రూ. 50 రుసుం మాత్రమే సంబంధిత గ్రామ సచివాలయాల్లో చెల్లిస్తే జాయింట్ పట్టాదారుల భూములను ఉచితంగా సబ్ డివిజన్ చేస్తామని తెలిపారు. ఈ ఉచిత సేవ సదవకాశం ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమేనని స్పష్టం చేశారు.

మహిళలు రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్యలక్ష్మి



స్వయం సహాయక సంఘాల మహిళలకు మెగా చెక్కు అందిస్తున్న అధికారులు

చాపాడు : స్వయం సహాయక సంఘాలకు బ్యాంకులు అందిస్తున్న రుణాలను తీసుకుని వాటిని స్వయం ఉపాధి కల్పనగా మార్చుకోవాలని.. దీని ద్వారా వ్యాపారం చేసుకుంటూ ఉత్పత్తిదారులుగా మారాలని డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక స్త్రీ శక్తి భవనంలో గురువారం యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో మెగా అగ్రీ డ్రైవ్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ బ్యాంకు కడప రీజినల్ హెడ్ ఆఫీసర్ లక్ష్మి తులసి, డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి 27 సంఘాల మహిళలకు రూ.5కోట్ల బ్యాంకు రుణాలు, లక్‌పతి దీదీ పథకం ద్వారా 14 సంఘాల మహిళలకు రూ.70లక్షల మెగా చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ దేశంలోనే ఏపీలో డ్వాక్రా సంఘాలు ఎక్కువగా ఉన్నాయని, ఫలితాలు కూడా బాగున్నాయన్నారు. మహిళలు బ్యాంకులు ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

లక్‌పతి దీదీ నుంచి కరోడ్‌పతి దీదీలుగా మారాలి

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని, లక్ష్యం నిర్దేశించుకుని ఆర్థికాభివృద్ధి వైపు పయనించాలని, స్వయం సహాయక సంఘాల మహిళలు బ్యాంకులు ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంకు రీజినల్ హెడ్ లక్ష్మి తులసి అన్నారు. గ్రూపు సంఘ సభ్యులతో పాటు మహిళలకు వేర్వేరుగా ఆర్థికాభివృద్ధి చెందేందుకు ఒక్కొక్కరి రూ.5లక్షల నుంచి రూ.10లక్షల వరకూ రుణాలను మంజూరు చేస్తామన్నారు. దీని ద్వారా మహిళలు వ్యాపారాలు ఏర్పాటు చేసుకుని లక్‌పతి దీదీ నుంచి కరోడ్‌పతి దీదీలుగా మారాలన్నారు. జిల్లాలోని 48 బ్రాంచ్‌లలో 8500 సంఘాలు ఉండగా, చాపాడు మండలంలో బ్రాంచ్ పరిధిలో 10శాతం సంఘాలు ఉన్నాయన్నారు. జిల్లాలో చాపాడు మండలం మొదటి స్థానంలో ఉందని, ఇదే విధంగా కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీధర్, బ్యాంకు మేనేజర్ కేవీ రమణ, సీసీలు, యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన గురువారం పెద్దమండ్యం మండలంలో జరిగింది. కనకంటివారిపల్లెకు చెందిన సాంబశివ(25) టెంపో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పలువురి వద్ద అప్పులు చేశాడు. వారి ఒత్తిడి అధికం కావడంతో గురువారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడితో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సురేంద్రారెడ్డి, సిబ్బంది

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక పొట్టిపాడు రోడ్డులోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్నారని సమాచారం రావడంతో గురువారం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ సురేంద్రారెడ్డి సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. దాడిలో జమ్మలమడుగులోని సాయిబాబా కొట్టాలు ప్రాంతానికి చెందిన మాలేపాటి సుదర్శన్ అనే వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 1.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇతను నెల్లూరు జిల్లాలోని ఒక వ్యక్తి నుంచి గంజాయిని కొనుగోలు చేసి చిన్న చిన్న పొట్లాల రూపంలో ఇక్కడ విక్రయిస్తున్నట్లు సీఐ తెలిపారు. సుదర్శన్‌పై కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు చెప్పారు.

ఆస్పత్రిలో చేర్పించి వదిలేసుకున్నారు

ఐదు రోజులుగా అనాథగా పడి ఉన్న మహిళ



హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు క్రైం : ఈమె పేరు లక్ష్మీదేవి. వయసు సుమారు 65 ఏళ్లు. ప్రొద్దుటూరులోని వైఎంఆర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. ఆమె కొన్ని రోజులుగా పక్షవాతంతో బాధపడుతున్నారు. ఈ నెల 15న కుటుంబ సభ్యులు జిల్లా ఆస్పత్రిలో వదిలేసి వెళ్లారు. కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో ఆమెను జీఈ వార్డుకు తరలించి వైద్యం అందిస్తున్నారు. కుటుంబ సభ్యులు ఉన్నప్పటికీ ఐదు రోజుల నుంచి ఎవరూ రాలేదని ఔట్‌పోస్టు పోలీసులు చెబుతున్నారు. ఓపీ రిజిష్టర్‌లో లక్ష్మీదేవి, వైఎంఆర్ కాలనీ అని మాత్రమే రాసి ఉంది. సెల్ నంబర్ ఉన్నా అది పని చేయడం లేదు. ఉద్దేశపూర్వకంగానే తప్పుడు నంబర్ ఇచ్చి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. కావాలని వదిలించుకునేందుకే ఆమెను హాస్పిటల్‌లో వదిలేసి వెళ్లినట్లు పోలీసులు అంటున్నారు. ప్రస్తుతం లక్ష్మీదేవి మాట్లాడలేని స్థితిలో ఉంది. అందరూ ఉన్నా ఆమె దిక్కు మొక్కూ లేని అనాథలా పడి ఉంది. లక్ష్మీదేవి కుటుంబ సభ్యుల చిరునామాను తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

అంబేడ్కర్ విగ్రహం ధ్వంసం

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ మల్లారపువాండ్లపల్లె నల్లగుట్ట క్రాస్ వద్ద దళితుల హౌసింగ్ కాలనీ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు బుధవారం రాత్రి పాక్షికంగా ధ్వంసం చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే బుధవారం రాత్రి దుండగులు ధ్వంసం చేసి కిందపడేశారు. విషయం తెలుసుకున్న ఏపీ ఎమ్మార్పీఎస్ నాయకులు ముల్లంగి చంద్రయ్య గురువారం జిల్లా అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో తహశీల్దార్ నరేంద్రకుమార్, వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబు, ఎస్ఐ చిన్నరెడ్డెప్ప సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడుతూ గతంలో కూడా కేవీపల్లెలో అంబేడ్కర్ విగ్రహం చూపుడు వేలు ధ్వంసం చేశారని, ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరగలేదన్నారు. ఈ ఘటనలో అయినా అధికారులు నిందితులపై కఠిన చర్యలు తీసుకుని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు.

రెవెన్యూ అధికారుల మాయాజాలం

పుల్లంపేట : పుల్లంపేట మండలం, అప్పారాజుపేట గ్రామానికి చెందిన ముంతాజ్ బేగం తన భర్త నుండి సర్వేనెంబరు 157/1లో 54 సెంట్లు, సర్వే నెంబర్ 156/1లో 1.11 ఎకరాల భూమిని 1984 సంవత్సరంలో కొనుగోలు చేశారు. అయితే రెవెన్యూ అధికారులు తమ భూమిని వేరొకరి పేరుతో ఆన్‌లైన్ చేయడంతో సమస్యను పరిష్కరించాలని రెండు సంవత్సరాల నుంచి తిరుగుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. వీఆర్ఓ మల్లికార్జున మాత్రం మొక్కుబడిగా నోటీసులు పెట్టి చేతులు దులుపుకున్నారని, సమస్యను పరిష్కరించాలని కోరితే చూస్తామంటూ కాలయాపన చేస్తున్నారని, తమ భూమిని వేరుకరి పేరుతో ఆన్‌లైన్ ఎలా చేస్తారని ముంతాజ్ బేగం ఆవేదన వ్యక్తం చేశారు.

అన్నమాచార్య యూనివర్సిటీలో న్యాయ కళాశాల



మాట్లాడుతున్న అన్నమాచార్య యూనివర్సిటీ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి

రాజంపేట : అన్నమాచార్య యూనివర్సిటీలో న్యాయవిద్యను అందించేందుకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) అనుమతి ఇచ్చింది. ఈ మేరకు ఏయూ చాన్స్‌లర్ చొప్పా గంగిరెడ్డి, ప్రో చాన్స్‌లర్ చొప్పా అభిషేక్‌రెడ్డిలు గురువారం ఇక్కడి విలేకర్లకు తెలిపారు. ఈ సందర్భంగా చొప్పా గంగిరెడ్డి మాట్లాడుతూ మూడు సంవత్సరాల న్యాయవిద్య కోర్సు ప్రారంభించేందుకు బీసీఐ అనుమతి రావడం పట్ల వారు హర్షం వ్యక్తంచేశారు. 2025-2026 విద్యాసంవత్సరానికి ఒక సెక్షన్‌లో 60 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తామన్నారు. ఏయూకు మరో గుర్తింపు లభించిందన్నారు. ఏయూ అభివృద్ధిలో మరో అడుగు ముందుకేసిందన్నారు. న్యాయవిద్యకోసం ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా రాజంపేట వాసులకు అందుబాటులో లా కాలేజి రావడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, ఏయూ వీసీ డా.సాయిబాబరెడ్డి, రిజిస్ట్రార్ డా.మల్లికార్జున రావు, ఏవో సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న వ్యాన్

ఒకరు మృతి, మరొకరికి గాయాలు



మృతి చెందిన నరేంద్రారెడ్డి, గాయపడిన కుళ్లాయప్ప

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని నల్లపురెడ్డిపల్లె గ్రామానికి వెళ్లే రహదారిలో సత్రం దగ్గర గురువారం ద్విచక్ర వాహనాన్ని డీసీఎం వాహనం ఢీకొంది. ఈ సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. లింగాల మండలం అంబకపల్లె గ్రామంలో నివాసముంటున్న నరేంద్రారెడ్డి, కుళ్లాయప్పలు వ్యవసాయ పనులు చేసేందుకు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. పనుల నిమిత్తమై గురువారం సాయంత్రం ద్విచక్ర వాహనంలో అంబకపల్లె గ్రామం నుంచి పులివెందులకు వస్తుండగా సత్రం బడి వద్ద పులివెందుల నుంచి నల్లపురెడ్డిపల్లె వైపు వెళ్తున్న డీసీఎం వ్యాను ఢీకొంది. ఈ సంఘటనలో నరేంద్రారెడ్డి(32) అక్కడిక్కడికే మృతి చెందగా.. కుళ్లాయప్ప అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం 108 వాహనంలో కడప రోడ్డులో ఉన్న పులివెందుల ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవు

ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్



పోరుమామిళ్లలో విలేకరులతో మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

పోరుమామిళ్ల : విద్యావంతులే ఎక్కువగా సైబర్ మోసాలకు గురవుతున్నారని, డిజిటల్ అరెస్టు లంటూ వచ్చే మోసపూరిత కాల్స్‌పై పోలీసు అధికారులకు, సైబర్ క్రైమ్ విభాగానికి ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్ సూచించారు. గురువారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోరుమామిళ్ల మండల సమస్యలు, నేరాల గురించి అడిగారు. అనంతరం ఆయన నేరాల గురించి మాట్లాడుతూ ఇక్కడ క్రైమ్ రేటు తక్కువగా ఉన్నా భూ సమస్యలు ఉన్నాయన్నారు. మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. పోక్సో చట్టం అమలవుతుందన్నారు. మట్కా, క్రికెట్, గంజాయి, గ్యాంబ్లింగ్ తదితర అసాంఘిక కార్యక్రమాలపై పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ట్రాఫిక్ సమస్యపై దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. లోన్ యాప్‌పై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, సీఐ శ్రీనివాసులు, పోరుమామిళ్ల, కలసపాడు ఎస్ఐలు కొండారెడ్డి, తిమోతి పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

కలసపాడు : స్థానిక పోలీస్‌స్టేషన్‌ను గురువారం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీకి పోలీసులు గౌరవ వందనం చేశారు. మండలంలో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి సూచించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణం ఆహ్లాదకరంగా ఉండటంతో సిబ్బందిని అభినందించారు. ఎస్పీ వెంట మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్, పోరుమామిళ్ల సీఐ డి.శ్రీనివాసులు, ఎస్ఐ తిమోతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కేసులో వైఎస్సార్‌సీపీ నాయకులకు బెయిల్ మంజూరు

రిమాండ్‌లో ఉన్న 13 మందితోపాటు మరో ముగ్గురికి బెయిల్ మంజూరు



వైఎస్సార్‌సీపీ నాయకులను కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్న పోలీసులు



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ లీగల్ అడ్వయిజర్ ఓబుళరెడ్డి

పులివెందుల : కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులో వైఎస్సార్ సీపీ నాయకులకు బెయిల్ మంజూరు అయింది. వివరాలు ఇలా ఉన్నాయి. గత నెల 26వ తేదీన టీడీపీ మహానాడు నేపథ్యంలో పులివెందులలో వైఎస్ఆర్ విగ్రహానికి టీడీపీ జెండాలు, తోరణాలు కట్టారు. అయితే వాటిని తొలగించాలని పులివెందుల మున్సిపల్ కమిషనర్, పులివెందుల డీఎస్పీలకు వైఎస్ఆర్ సీపీ నాయకులు వినతి పత్రాలను ఇచ్చారు. అయితే వారు అధికార పార్టీ నేతల ఒత్తిడి వల్ల పట్టించుకోలేదు. దీంతో పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, పట్టణ అధ్యక్షుడు హాలు గంగాధరరెడ్డిలతోపాటు మరి కొంతమంది వైఎస్సార్‌సీపీ నాయకులు ఆ జెండాలు, తోరణాలను తొలగించారు. అయితే దీన్ని సాకుగా చూపి అప్పట్లో జిల్లాలో ఉన్న టీడీపీ మంత్రులు, హోం మంత్రి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవిలు పోలీసులకు వీరిపై అక్రమ కేసు పెట్టమని గట్టిగా ఆదేశాలు ఇచ్చారు. ఆ మేరకు వారు అక్రమ కేసులు బనాయించారు. టీడీపీ నాయకులపై దాడి చేసినట్లుగా వైఎస్సార్‌సీపీ నాయకులపై అటెమ్ట్ మర్డర్ కేసు నమోదు చేశారు. టీడీపీ నాయకుడిపై దాడి చేసినట్లుగా ఎలాంటి ఆధారాలు కానీ, మీడియాలో వార్తలు కానీ, సాక్ష్యాలు కానీ లేవు. అయినా కూడా కేవలం టీడీపీ నేతల ఒత్తిడితో పులివెందుల పోలీసులు వైఎస్సార్‌సీపీ నాయకులపై ఈ కేసు నమోదు చేశారు.

బెయిల్ మంజూరు

టీడీపీ నాయకుల ఒత్తిడి మేరకు పులివెందుల చైర్మన్‌తో పాటు ఇతర వైఎస్సార్‌సీపీ నాయకులపై అటెమ్ట్ మర్డర్ కేసు నమోదు చేశారు. అయితే ఇందులో ఏమాత్రం సంబంధం లేని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పీఏ రాఘవరెడ్డితో పాటు మరికొంతమందిపై కేసు నమోదు చేశారు. అయితే జిల్లా కోర్టు ఇప్పటికే ఈ కేసులో రిమాండ్‌లో ఉన్న 13మంది వైఎస్సార్‌సీపీ నాయకులకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయడంతోపాటు రాఘవరెడ్డితోపాటు మరో ఇద్దరికి ముందస్తు బెయిల్ కోర్టు మంజూరు చేసింది.

పోలీసులు వైద్య పరీక్షలు నిర్వహించాలి

పులివెందుల పోలీసుల అక్రమ కేసులో ఉన్న వైఎస్సార్‌సీపీ నాయకులకు హైకోర్టు ఆదేశాల మేరకు కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించాలని వైఎస్సార్‌సీపీ లీగల్ అడ్వయిజర్ ఓబుళరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన హైకోర్టు ఆదేశాల ప్రకారం హైకోర్టు ఇచ్చిన సూచనల కాపీలను పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు సమర్పించారు. హైకోర్టు ఆదేశాల మేరకు కచ్చితంగా వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆయన గట్టిగా డిమాండ్ చేశారు.

వైద్య పరీక్షల నిమిత్తం కర్నూలుకు తరలింపు

పులివెందుల పోలీసులు అక్రమ కేసు బనాయించి వైఎస్సార్‌సీపీ నాయకులను అరెస్టు చేసి వారిపై అప్పట్లో థర్డ్ డిగ్రీ ప్రయోగించడం జరిగింది. అయితే వీరిని జమ్మలమడుగు మేజిస్ట్రేట్ ఎదుట రిమాండ్‌కు హాజరుపెట్టినప్పుడు కేసులో ఉన్న పార్నపల్లె కిశోర్, సాతుపాటి రాజేష్, కావేటి మల్లికార్జున, షేక్ మస్తాన్, పార్నపల్లె వెంకట చలపతి, సాతుపాటి వెంకటపతిలు మేజిస్ట్రేట్ ముందు పోలీసులు తమపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారని చెప్పారు. దీంతో జమ్మలమడుగు మేజిస్ట్రేట్ వీరికి పులివెందుల వైద్యశాలలో మెడికల్ టెస్ట్‌లు నిర్వహించాలని ఆదేశించారు. అయితే ఇక్కడ టీడీపీ నాయకులు, పోలీసులు డాక్టర్లపై తీవ్ర ఒత్తిడి తెచ్చి నిందితులపై గాయాలు లేనట్లుగా నివేదిక ఇచ్చారు. దీంతో వీరు హైకోర్టులో పోలీసులు తమను కొట్టినట్లుగా, డాక్టర్లు తప్పుడు నివేదిక ఇచ్చినట్లుగా ప్రైవేట్ కంప్లయింట్ వేశారు. హైకోర్టు నిందితుల తరఫున మేరలా కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి పూర్తి నివేదిక సమర్పించాలని పోలీసులను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆరుగురు నిందితులను గురువారం రాత్రి పోలీసులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.